క్లుప్తంగా

ఆధార్ కేంద్రం ఏర్పాటు

ఒంటిమిట్ట : మండల ప్రజలు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆధార్ సెంటర్ ఒంటిమిట్టలో ప్రారంభమైంది. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఆధార్ నమోదు, సవరణలకు కడప వరకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మండల కేంద్రంలో అందుబాటులోకి రావడంతో ప్రజలకు సౌలభ్యం కలుగనుంది. కొత్త ఆధార్ నమోదు, పేరు, పుట్టినతేదీ సరిదిద్దుకోవడం, చిరునామా మార్పు, ఫొటో, వేలిముద్రలు, నేత్రపుటాల (బయోమెట్రిక్) అప్‌డేట్, మొబైల్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ లింక్ చేయడం, ఆధార్ - పాన్, ఆధార్ బ్యాంక్ ఖాతా లింక్ చేయడం, ఈ - ఆధార్ ప్రింట్ తదితర సదుపాయాలు అందించనున్నట్టు తెలియజేశారు. మండలంలోని ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఉన్నవారు తమ వివరాలు సరిచూసుకొని అవసరమైన అప్‌డేట్లు చేసుకోవాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన టీచర్లు

సంబేపల్లె : క్విజ్ పోటీల ద్వారా విద్యా ప్రయోజనాలు మెరుగవుతాయని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ సబ్జెక్ట్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపరిచి, భావనలను బలోపేతం చేస్తాయన్నారు. జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహిస్తాయన్నారు. విజేతగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందచేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుల్‌రెడ్డి, రవిశంకర్, రెడ్డిశేఖర్, హేమ ప్రశాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవిందంపల్లి చెరువులో విగ్రహాల నిమజ్జనం



చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏపీఎండీసీ, పోలీసు అధికారులు

ఓబులవారిపల్లె : గణేష్ విగ్రహాల నిమజ్జనం మంగంపేట ఏపీఎండీసీ సమీపంలోని గోవిందంపల్లి చెరువులో నిర్వహించనున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఏపీఎండీసీ అధికారులు ఎస్ఐ మహేష్‌తో కలిసి గోవిందంపల్లి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వినాయక చవితి అనంతరం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి మండలాల నుంచి వినాయక విగ్రహాలను గోవిందంపల్లి చెరువుకు తీసుకురావడం జరుగుతుందని, ఏపీఎండీసీ అధికారులతో కలిసి పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఓ గోపినాథ్, మేనేజర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె : వాహనదారులు నియమ, నిబంధనలు తప్పక పాటించాలని, లేకుంటే జరిమానా, జైలు శిక్షలకు గురికావాల్సి వస్తుందని సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధిలోని భైరాగుట్ట సమీపంలో సోమవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. హెల్మెట్ లేని ప్రయాణం నేరమని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీఎస్ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ స్వాతి

సుండుపల్లె : ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీసీఎస్ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్వాతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. హెచ్ఐవీలోని 8 రకాల అంశాలపై వివిధ వారాల పాటు 'మీకు తెలుసా?' రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ త్రివేణి, సుహాసిని, రమణమ్మ, శివ కుమార్, పీసీఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దండాలయ్యా.. బొజ్జ గణపయ్యా

- వాడవాడలా మొదలైన వినాయక చవితి సందడి
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్ ప్రాంతాలు



కోడూరులో వినాయకుడికి ఇష్టమైన పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో వినాయక ఉత్సవాల నిర్వహణకు యువకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. రేపు (బుధవారం) వినాయక చవితి పురస్కరించుకొని సోమవారం నుంచే వినాయకుడి విగ్రహాలను మండపాలకు తరలించారు. పట్టణంలో పూలు, పండ్ల, పూజా సామగ్రి, చిన్నపాటి వినాయక విగ్రహాలకు గిరాకీ ఏర్పడింది. ఒకప్పుడు తిరుపతి పట్టణంలోని మంగళానికి వెళ్లి వినాయకుడి విగ్రహాలను రైల్వేకోడూరుకు తరలించేవారు. కానీ గత నాలుగు సంవత్సరాలుగా రైల్వేకోడూరులోని రాఘవరాజపురం, ఓబనపల్లి ప్రధాన రహదారిలో రెండు, మూడుచోట్ల భారీ విగ్రహాలు వందల సంఖ్యలో తయారుచేస్తూ అమ్మకాలకు పెట్టారు. విగ్రహం రూ.3వేల నుంచి రూ.30వేల వరకు అమ్మకాలు జరుపుతున్నారు. యువకులు వినాయక చవితికి వారం రోజుల ముందు నుంచే ఇంటింటికి తిరిగి చందాలు సేకరించి ఆ సొమ్ముతో విగ్రహాలు కొనుగోలు చేస్తూ వినాయక చవితిని వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పట్టణంలోని రంగనాయకులపేట, నరసరాంపేట, పాతబజార్, కొత్తబజార్, తులసీరాం వీధి తదితర ప్రాంతాల్లో వినాయక చవితిని ప్రతి యేటా ఘనంగా నిర్వహిస్తుంటారు. అలాగే రైల్వేకోడూరు సీఐలు హేమసుందర్‌రావు, వెంకటేశ్వర్లుల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. ముందస్తుగా నిర్వాహకుల పేర్లు, ఫోన్ నెంబర్లు సేకరించి వినాయక ఉత్సవ కమిటీలకు తగిన ఆదేశాలు, సూచనలు ఇచ్చారు.



కోడూరు పట్టణంలో మండపాలను ప్రత్యేకంగా అలంకరించిన నిర్వాహకులు



గణేష్ ప్రతిమను ఉత్సవాలకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న యువకులు

గ్రామాలకు చేరుకుంటున్న గణనాథులు

పెనగలూరు : వినాయక చవితి సందర్భంగా సోమవారం నుంచే గణనాథులు గ్రామానికి చేరుకుంటున్నారు. అనేక గ్రామాలలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు కలిసి రెండు రోజులు ముందే వినాయక విగ్రహాలను గ్రామాలకు తీసుకొస్తున్నారు. మంగళవారం అన్ని గ్రామాల వారు విగ్రహాలకు వస్తే ఇబ్బందికరంగా ఉంటుందన్న నేపథ్యంలో కొంతమంది సోమవారమే విగ్రహాలను తమతమ గ్రామాలకు భారీగా ఊరేగింపుతో తీసుకువచ్చారు. ఇండ్లూరు గ్రామానికి చెందిన ప్రజలు చెక్కభజన, మేళతాళాలు, వివిధ అలంకరణతో కూడుకున్న నృత్యాలు చేస్తూ వినాయకుని భారీగా ఊరేగింపు చేస్తూ గ్రామానికి తరలించారు. వినాయక విగ్రహాల ప్రతిష్టకు పోలీస్టేషన్‌కు ఇప్పటికే 63 దరఖాస్తులు వచ్చినట్లు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు.



ఊరేగింపుగా చవితి పూజలకు తరలివెళ్తున్న పెనగలూరు గణనాథుడు

కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యం

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పునాది కార్యకర్తలేనని, వారికి రాబోయే రోజుల్లో సముచిత స్థానం ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలు అధైర్యపడవద్దని చెప్పారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండి సమస్యలలో అండగా ఉంటామని తెలిపారు. కార్యకర్తలు లేనిదే నాయకుడు లేడని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఒక కుటుంబం లాంటిదని చిన్న, చిన్న సమస్యలు, తగాదాలు వచ్చినపుడు సర్దుకొని కలిసికట్టుగా కూర్చుని మాట్లాడుకోవాలన్నారు. ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పిన పథకాలు, చెప్పని పథకాలు మొదటి ఏడాదిలోనే అమలు చేసి ప్రజలకు సంక్షేమం అంటే ఏంటో తెలియజేశారన్నారు. చంద్రబాబు ఏడాదికి ఒక పథకం అమలు చేస్తూ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. రాబోయే రోజులలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీలో అగ్రస్థానం ఉంటుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్ రమేష్, అన్వర్‌బాషా, పంజం వేణుగోపాల్‌రెడ్డి, వెలగచర్ల శివారెడ్డి సుబ్బరామరాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పింఛన్ల తొలగింపుపై దివ్యాంగుల ఆగ్రహం



చిట్వేలి: ఎంపీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, నాయకులు



రాజంపేట రూరల్: సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగుల నిరసన

చిట్వేలి : అర్హులమైన తమకు పింఛన్లు తొలగించడంపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్యాయంగా తమ పింఛన్లు తొలగించిందంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి తమ నిరసనను తెలిపారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పింఛన్‌దారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ ఆంధ్రయ్య మాట్లాడుతూ పింఛన్లు రద్దుచేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకుని నిజమైన దివ్యాంగులకు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ పద్మభూషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్లు రద్దు చేయలేదని, యథావిధిగా పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో నరసింహరాజు, సుబ్బరాయుడు, గంగాధర్, గోపాల్‌రాజు, నాగమణి, రత్నమ్మ, నారాయణ, నరసయ్య, వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవిటితనం దివ్యాంగులుకా.. నిర్ధారించలేని వైద్యులుకా?

రాజంపేట రూరల్ : అవిటితనం ఉండేది దివ్యాంగులుకా లేక వికలత్వాన్ని నిర్ధారించలేని వైద్యులకా అని రాజంపేట, పుల్లంపేట మండల విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు ఎస్.అబ్దుల్‌ఖాదర్, మల్లు సుబ్బనరసారెడ్డిలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తొలగించిన పెన్షన్‌లను వెంటనే పునరుద్ధరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలని నినదించారు. అనంతరం ఏఓ బీ.శ్రీధర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి దివ్యాంగుల పింఛన్‌లను ఇటీవల జరిగిన మెడికల్ వెరిఫికేషన్‌లో తొలగించడం అన్యాయమని మండిపడ్డారు. దివ్యాంగుల కుటుంబాలు పెన్షన్ మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తొలగించిన పెన్షన్‌లను వెంటనే కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరారు. నిరసన కార్యక్రమంలో రాజంపేట, పుల్లంపేట, నందలూరు, పెనగలూరు మండలాలలోని దివ్యాంగులు వెంకటప్రసాద్, నరసింహులు, వాహిద్, తిరుపాల్, తిరుమల రెడ్డి, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రాయచోటి టౌన్ : ఎరువుల స్టాక్, రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రాజంపేట రూరల్: ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మురళీకృష్ణ, నాగలక్ష్మి

రాజంపేట రూరల్ : అధిక ధరలు వేసి రైతులకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుమటామని విజిలెన్స్ అధికారి జె.మురళీకృష్ణ హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి జి.నాగలక్ష్మితో కలిసి మురళీకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు అక్కడ ఉన్న యూరియా స్టాక్‌ను పరిశీలించారు. అదే విధంగా స్టాక్ రిజిస్టార్, బిల్ పుస్తకాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బలవంతంగా ఎరువులను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. దుకాణాదారులతో ఎటువంటి సమస్యలు ఉన్న రైతులు సమాచారం అందించాలన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని పలు ఎరువులు దుకాణాలను విజిలెన్స్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బాబు మోజెస్ (రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్), రాయచోటి మండల వ్యవసాయశాఖ అధికారి రాజేంద్రప్రసాద్‌తో కలసి పలు షాపులను తనిఖీ చేశారు. ఉన్న స్టాక్ ప్రకారం బస్తాలు ఉన్నాయా లేదా.. ఎన్ని బస్తాలు అమ్మారనే విషయమై వారి వద్ద ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు అమ్మినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే ఎక్కడా ఎరువుల కొరత రాకుండా చూడాలని సూచించారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

కడప కార్పొరేషన్ : కడపలోని మురళీ థియేటర్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి పి. రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు హాజరవుతున్నారని తెలిపారు.

లీగల్ సర్వీసెస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి : ఖైదీలు హక్కులు, ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి ఎస్.బాబాఫకృద్దీన్ సూచించారు. సోమవారం రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని రిజిష్టర్లను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను జైలు అధికారులు, సిబ్బందికి తెలియజేశారు. జైలులో ఉన్న ఖైదీలకు హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం తదితర అంశాలను ఖైదీలకు వివరించారు. అలాగే ఖైదీల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలు పరిసరాలను, రిజిష్టర్లను పరిశీలించి తగు సూచనలను, సలహాలను అందజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100పై ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించాలని ఖైదీలకు తెలియపరిచారు. కార్యక్రమంలో రాయచోటి సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



వీరబల్లి: సమావేశంలో మాట్లాడుతున్న రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్



పెనగలూరు: ఉత్సవ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి

పెనగలూరు : వినాయక చవితి వేడుకలను నియమ, నిబంధనలు పాటిస్తూ ఘనంగా జరుపుకోవాలని ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం గ్రామాలలో వినాయక చవితి కమిటీ సభ్యులతో పోలీసు స్టేషన్ ప్రాంగణంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేటప్పుడు రోడ్డును మూసివేయకుండా, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఉందని తెలియజేశారు. వచ్చే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, విద్యుత్ వైర్లను జాయింట్లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. నిమజ్జనం రోజున చిన్నపిల్లను నీటి వద్దకు రాకుండా చూడాలన్నారు. ఊరేగింపు సమయాలలో డీజేలు పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాముడు, విద్యుత్ సిబ్బంది, వినాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరబల్లి : మండలంలో వినాయక పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ వద్ద ఉత్సవ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఉండాలన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి బొమ్మ వద్ద అల్లరి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నిమజ్జనం రోజు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావంతో పండుగ జరుపుకోవాలి

నందలూరు : వినాయక చవితి పండుగను ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా భక్తిభావంతో పండుగ జరుపుకోవాలని కమిటీ సభ్యులను ఉద్దేశించి సీఐ బివి రమణ తెలియజేశారు. వినాయక చవితి పండుగను దృష్టిలో ఉంచుకొని సోమవారం రాజంపేట రూరల్ సీఐ బివి రమణ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ సుబ్రమణ్యం, ముస్లిం మత పెద్దలు, అన్ని గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ బివి రమణ

కడప నగర నీటి అవసరాలకు మరో పంప్ హౌస్

సిద్దవటం : కడప నగరానికి నీటి కొరతను తీర్చేందుకు అదనంగా మరో పంప్ హౌసుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు తెలిపారు. మండలంలోని లింగంపల్లిలో సోమవారం తహసీల్దార్ మాట్లాడుతూ లింగంపల్లి వద్ద పెన్నానది నుంచి పంప్ హౌస్ ద్వారా కడప నగరానికి తాగునీరు సరఫరా అవుతోందన్నారు. ప్రస్తుతం సరఫరా అయ్యే నీరు కడప నగరానికి సరిపడకపోవడంతో నీటిని సరఫరా చేసేందుకు అదనంగా మరో పంప్ హౌస్‌ను పెన్నానదిలో నిర్మించడం జరుగుతోందన్నారు. పంప్ హౌస్‌కు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్, కడప ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. డీకేటీ స్థలాలు ఉంటే వాటిని పరిశీలిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఆర్ఓ రజినీ, గ్రామ సర్వేయర్ కారుణ్య, వీఆర్ఏ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

'జిల్లేలమడక'లో అక్రమ తవ్వకాలు అరికట్టండి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లేలమడక చెరువులో అక్రమంగా మట్టిని తరలించి రూ.లక్షలు కొల్లగొడుతున్నారని దానిని అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓజీ శ్రీనివాసులరెడ్డి సోమవారం తహసీల్దార్ యామినీ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తహసీల్దార్‌తో మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా జిల్లేలమడక చెరువును తవ్వేస్తున్నారని, దీంతో ఆయకట్టు భూములకు నీరు అందే అవకాశం లేదని, ఇటువంటి అక్రమ మట్టి తవ్వకాలపై వెంటనే చర్యలు తీసుకొని అరికట్టాలన్నారు. అలాగే చిన్నఓరంపాడు నుంచి మండల కేంద్రానికి వేసిన రోడ్డు అరవపల్లి వరకు మాత్రమే వేశారని, మండల కేంద్రానికి గుత్తేదారుడు వేయలేదని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ యామినీ రెడ్డి స్పందిస్తూ జిల్లేలమడక చెరువుకు సంబంధించి ఇరిగేషన్ అధికారులకు నివేదికలు పంపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సిద్దేశ్వరరావు, ఆర్ఐ మల్లికార్జున రెడ్డి, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసులరెడ్డి

హాకథాన్‌కు ఎంపికైన ఏయూ విద్యార్థిని ప్రాజెక్ట్

- ఎంఎస్ఎంఈ ద్వారా సింధూరికి రూ.14.5 లక్షలు మంజూరు

రాజంపేట : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు, అలుమ్నీల ఆవిష్కరణకు ప్రోత్సాహం లభిస్తోందని వీసీ డా.సాయిబాబారెడ్డి అన్నారు. సోమవారం అలుమ్నీ ఆవిష్కరణకు ఎంఎస్ఎంఈ 4.0(సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ) హాకథాన్‌లో గుర్తింపు, రూ.14.5 లక్షల మంజూరు సందర్భంగా అలుమ్నీ కె.సింధూరిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకథాన్ పథకం ద్వారా సమాజానికి ఉపయోగకరమైన ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు తోడ్పడుతుందన్నారు. కళాశాలలో ఈసీఈ చదువుతున్న కె.సింధూరి సమర్పించిన ఆలోచన ఎంఎస్ఎంఈ 4.0 హాకథాన్‌లో ఎంపిక కావడం హర్షణీయమన్నారు. పట్టుపురుగుల వ్యర్థాలను వినియోగించి అలంకార వస్తువులు, మెమెంటోలు తయారు చేయబడుతుందన్నారు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకొని రూ.14.5 లక్షల మంజూరు చేయబడ్డాయన్నారు. ఈ నిధులను వినియోగించి స్టార్టప్‌ను ప్రారంభించడానికి ఏయూతో కలిసి ముందుకు సాగనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీన్ డా.కృష్ణమోహనరాజు తదితరులు పాల్గొన్నారు.



సింధూరిని అభినందిస్తున్న ఏయూ వీసీ

వైభవంగా భైరవస్వామి గ్రామోత్సవం

గాలివీడు : మండల పరిధి పేరంపల్లి గ్రామంలో వెలసిన భైరవస్వామి గ్రామోత్సవాన్ని అవుల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పేరంపల్లి గ్రామం అవుల వాండ్ల పల్లె నుంచి డప్పువాయిద్యాల మధ్య బాణసంచాల పేలుళ్లు, కోలాట ప్రదర్శనలతో ఊరేగింపుగా గండిమడుగు ఆలయానికి చేరుకున్నారు. అనంతరం భైరవస్వామికి నదీ జలాలతో సాంప్రదాయబద్ధంగా పుణ్య స్నానాలు ఆచరింపజేసి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.



ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం ప్రదర్శన